సింగరేణి జాయింట్ వెంచర్‌ను ఒప్పకోం

తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ స్పష్టం

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : రామగుండం థర్మల్ ప్లాంట్‌ను సింగరేణి భాగస్వామ్యంతో నిర్మించేందుకు ఎట్టి పరిస్థితిలో ఒప్పుకునేది లేదని, ఈ ప్లాంట్‌ను జెన్‌కో ద్వారానే నిర్మించాలని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ స్పష్టం చేసింది. జాయింట్ వెంచర్ అంటే ప్రైవేటీకరణను ప్రోత్సహించడమేనని జేఏసీ నేతలు ఆరోపించారు. జేఏసీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా శనివారం ఖైరతాబాద్‌లోని విద్యుత్ సౌధలో జేఏసీ నేతలు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ సాయిబాబా మాట్లాడుతూ.. మూడేండ్లుగా జెన్‌కో లాభాల్లో నడుస్తున్నదని, 2020-21లో రూ. 168 కోట్లు, 2021-22లో రూ.394.46 కోట్లు, 2022-23లో రూ.472.94 కోట్ల లాభాలను ఆర్జించిందని తెలిపారు. జెన్‌కో ఈక్విటీతోనే రామగుండంలో నిర్మించతలపెట్టిన 800 మెగావాట్ల ప్లాంట్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ రత్నాకర్‌రావు, కో కన్వీనర్ బీసీ రెడ్డి, వజీర్, మాజీద్, రమేశ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉత్పత్తి లక్ష్యం పెంపు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : బొగ్గు ఉత్పత్తి, రవాణాలో సింగరేణి లక్ష్యాన్ని క్రమంగా పెంచుకుంటున్నది. ఇది వరకు రోజుకు రెండు లక్షల బొగ్గును ఉత్పత్తి, రవాణా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ.. తాజాగా దీనిని 2.1 లక్షల టన్నులకు పెంచుకున్నది. బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని కంపెనీ సీఎండీ ఎన్ బలరాం ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో పాటు రోజుకు 15 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని అన్ని ప్రాంతాల జీఎంలకు ఆయన ఆదేశాలిచ్చారు. భారీ వర్షాలతో కొద్ది రోజుల పాటు సింగరేణిలో ఉత్పత్తి నిలిచిపోగా, వార్షిక లక్ష్యాన్ని చేరుకోవడంలో భాగంగా ఈ లక్ష్యాన్ని నిర్ధేశించారు.

● నల్లబ్యాడ్జీలతో కేటీపీపీ ఉద్యోగుల నిరసన

థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాలను జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని, సింగరేణి భాగస్వామ్యాన్ని అంగీకరించబోమని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ పేర్కొంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరులోని కేటీపీపీలో శనివారం ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. - గణపురం

చేనేత రుణమాఫీ ఏమాయే..!

- ఇచ్చిన హామీని బుట్టదాఖలు చేస్తున్న కాంగ్రెస్ సర్కారు
- తీవ్ర ఆవేదనలో చేనేత కార్మికులు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చేనేత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేనేత కార్మికుల వ్యక్తిగత రుణాలు మాఫీ చేస్తామని మాట ఇచ్చిన ప్రభుత్వం.. ఇంతవరకు పట్టించుకోకపోవడమే ఇందుకు కారణమవుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 10 వేల మంది కార్మికులు ఈ మాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 'చేనేత పాలసీ' అనేది ఏదీ లేదని చేనేత కార్మికులు మండిపడుతున్నారు. చేనేతలను సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని చేనేత కార్మికసంఘం రాష్ట్ర నాయకులు కూరపాటి రమేశ్, చెరుకు స్వామి విమర్శిస్తున్నారు. మరికొన్ని డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు.

- చేనేత, పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి కల్పించాలి.
- చేనేతల కోసం రూ.1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలనే డిమాండ్‌ను నెరవేర్చాలి
- త్రిఫ్ట్ ఫండ్, యూరన్ సబ్సిడీ, నేతన్నకు బీమా పథకాలు అమలు చేయాలి
- బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- వస్త్రనిల్వలు వెంటనే కొనుగోలు చేయాలి
- వర్కర్ టూ ఓనర్, జనతా వస్త్ర పథకాలను అమలు చేయాలి
- పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి
- యూరన్ సబ్సిడీ నిధులను కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలి
- ప్రతి నేతన్నకు పెట్టుబడిసాయం కింద రూ.5 లక్షలు అందించాలి
- ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరమైన వస్త్రాలను రాష్ట్రంలో ఉత్పత్తి చేయించాలి.

టీ కొట్టు శివకు ఐదు కొలువులు

- పోటీ పరీక్షల్లో పెద్దపల్లి జిల్లా ధర్మారం యువకుడి సత్తా
- గత మార్చిలో గురుకుల జేఎల్, పీజీటీ, టీజీటీల్లో ప్రతిభ
- తాజాగా జేఎల్, డీఎస్సీలో విజయ ధంకా

మహేశ్ కుమార్

ధర్మారం, అక్టోబర్ 5: ఓ పేదింటి బిడ్డ.. ప్రభుత్వ కొలువులు కొల్లగొట్టాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులతో కొన్నాళ్లు టీకొట్టు నడిపిన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన ఉడాన్ శివ మహేశ్ కుమార్.. ఆరు నెలల్లోనే ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సత్తాచాటాడు. ధర్మారానికి చెందిన ఉడాన్ సుశీల-లక్ష్మణ్ దంపతులకు శివ మహేశ్ రెండో కొడుకు. ధర్మారంలో చదువుకుంటూనే తల్లిదండ్రులకు సాయపడేవాడు. 2014లో సునీతను వివాహం చేసుకున్నాడు. 2020లో పీజీ పూర్తిచేశాడు. కరోనా టైంలో రాజారాంపల్లిలో టీకొట్టు నడిపాడు. తర్వాత దానిని వదిలేసి తల్లిదండ్రులు, మిత్రుల సహకారంతో 2022లో జూనియర్ లెక్చరర్ ఉద్యోగం కోసం కోచింగ్ తీసుకున్నాడు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2023లో గురుకులాల లెక్చరర్, టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా.. అదే ఏడాది ఆగస్టులో పరీక్షలు రాశాడు. గత మార్చిలో ఫలితాలు రాగా.. జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ కొలువులకు ఎంపికయ్యాడు. జూనియర్ లెక్చరర్ పోస్టును ఎంపిక చేసుకొని ప్రస్తుతం నిర్మల్ జిల్లా మామడలోని గురుకులంలో పనిచేస్తున్నాడు. అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 సెప్టెంబర్‌లో నిర్వహించిన ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ ఉద్యోగాల భర్తీ పరీక్ష, ప్రస్తుత ప్రభుత్వం ఆగస్టు 2024లో నిర్వహించిన డీఎస్సీ పరీక్షలు రాసి ప్రతిభ చాటాడు. ఇటీవలే విడుదలైన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంక్, డీఎస్సీ ఫలితాల్లో పెద్దపల్లి జిల్లాలో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. ఈ విజయం తన తల్లిదండ్రులకే అంకితమని శివమహేశ్ తెలిపారు.

నిలిచిన స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల వెరిఫికేషన్

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): పలు జిల్లాల్లో డీఎస్సీలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిలిచిపోయింది. కొన్ని జిల్లాల్లో ఇంకా 1:3 జాబితాలు విడుదల కాలేదు. కోర్టుకేసుల కారణంగా నిలిచినట్టు అధికారులు ప్రకటించారు. శనివారం వరకు (ఎస్జీటీ), స్కూల్ అసిస్టెంట్, భాషాపండితులు, పీఈటీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తికాగా, స్పెషల్ ఎడ్యుకేషన్ వెరిఫికేషన్ పూర్తికాలేదు. కోర్టుకేసులు లేని జిల్లాల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తిచేశామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి తెలిపారు.

- నల్లగొండలో ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తికాలేదు. కానీ ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ జాబితాలో 31కి 29 మంది హాజరయ్యారు.

హరీశ్ (ఫైల్) | సురేశ్ (ఫైల్) | హేమలత (ఫైల్)

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు కుటుంబం బలి

- రూ.30 లక్షలకుపైగా కుమారుడి అప్పులు
- 20 గుంటల భూమి అమ్మి అప్పుల చెల్లింపు
- మనస్తాపంతో కుమారుడితోపాటు తల్లిదండ్రుల ఆత్మహత్య
- నిజామాబాద్ జిల్లా వడ్డేపల్లిలో విషాదం

ఎడపల్లి, అక్టోబర్ 5: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు మరో కుటుంబం బలైంది. రూ.లక్షలు పోగొట్టిన ఓ యువకుడితోపాటు అతడి తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన శనివారం నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. ఎడపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన రంగణవేణి సురేశ్ (55), హేమలత (48) దంపతులకు ఇద్దరు సంతానం. మెదడు వాపు వ్యాధితో కూతురు చిన్నప్పుడే మృతి చెందింది. ఏకైక కుమారుడు హరీశ్ (22) నిజామాబాద్‌లో ఉంటూ పెట్రోల్ బంక్‌లో పని చేసేవాడు. ఆర్నెళ్ల క్రితం పని మానేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. సురేశ్ దంపతులు చిన్న కిరాణషాపు నడుపుతూ వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. కొత్త ఇల్లు కట్టుకుందామన్న ఆశతో గృహ నిర్మాణాన్ని ప్రారంభించారు. కుమారుడు హరీశ్ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి భారీగా అప్పులు చేశాడు. దీంతో తల్లిదండ్రులు ఇంటి నిర్మాణాన్ని ఆపేశారు. హరీశ్ చేసిన రూ.30 లక్షలకుపైగా అప్పులను తమకున్న 20 గుంటల భూమిని అమ్మేసి తీర్చారు. అయినప్పటికీ కుమారుడిలో మార్పు రాలేదు. నలుగురిలో తిరగలేక మనస్తాపం చెందిన తల్లిదండ్రులు, కుమారుడు శుక్రవారం రాత్రి ఉరేసుకున్నారు. తెల్లారినా ఎలాంటి అలికిడి లేకపోవడంతో ఇరుగుపొరుగు ఇంటి వెనుక నుంచి చూడగా వేలాడుతూ కనిపించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోధన్ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉగాండాలో జనగామవాసి హత్య

సెక్యూరిటీ గార్డు జరిపిన కాల్పుల్లో ప్రాణాలొదిలిన తిరుమలేశ్

తిరుమలేశ్ (ఫైల్)

జనగామ చౌరస్తా, అక్టోబర్ 5 : ఉగాండా దేశంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ప్రాజెక్ట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న జనగామవాసి ఇటికాల తిరుమలేశ్ (41) శుక్రవారం అక్కడ హత్యకు గురయ్యాడు. మృతుడి తమ్ముడు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా కేంద్రంలోని గిర్నిగడ్డ ఏరియాకు చెందిన తాపీ మేస్త్రీ ఇటికాల కిష్టయ్య-కిష్టమ్మ దంపతుల పెద్ద కుమారుడు తిరుమలేశ్ నల్లగొండ జిల్లాకు చెందిన రాయల్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 2014 నుంచి ప్రాజెక్ట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ కంపెనీకి ఉగాండాలోని నమ్మసాలలో బ్రాంచ్ కార్యాలయం ఉండటంతో 15 నెలల నుంచి భార్య, కుమారుడితో కలిసి తిరుమలేశ్ అక్కడే ఉంటున్నాడు. గురువారం ఉదయం 9.30 గంటలకు (ఉగాండా కాలమానం ప్రకారం) డ్యూటీకి వెళ్లాడు. అక్కడ కొత్తగా విధుల్లో చేరిన సెక్యూరిటీ గార్డు ఓపియో మద్యం మత్తులో గాల్లోకి కాల్పులు జరుపుతుండగా సహోద్యోగులతో కలిసి తిరుమలేశ్ బయటకు వచ్చాడు. సెక్యూరిటీగార్డు విచక్షణ కోల్పోయి తిరుమలేశ్‌పైకి కాల్పులు జరపగా ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో తిరుమలేశ్ భార్య సునీత, కుమారుడు వరుణ్ ఉగాండాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. కాగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫోన్‌లో వారిని పరామర్శించారు.

బల్దియాలో విద్యుత్ ఉపకరణాల మళ్లింపు?

కోల్‌సిటీ, అక్టోబర్ 5: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో విద్యుత్ ఉపకరణాలను మళ్లించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడడంతో కార్యాలయంలోని సామగ్రి మాయమవుతున్నట్లు తెలుస్తోంది. గతంలో కార్యాలయంలోని రెండు ఎయిర్ కండిషనర్ (ఏసీ)లను మరమ్మతుల కోసమని బయటకు తీసుకవెళ్లి తీరా.. ఒకటే ఏసీ తీసుకువచ్చి కార్యాలయంలో బిగించారు. మరో ఏసీ ఆరు నెలలు గడిచినా ఇంతవరకు కార్యాలయంకు చేరుకోలేదని తెలిసింది. కార్యాలయంలోని విలువైన ఏసీలను మరమ్మతుల కోసం బయటకు వెళ్లి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు తీసుకవచ్చి బిగించకపోవడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే గతంలో ఎగ్జామినర్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ చాంబర్లలోని రెండు ఏసీలను మరమ్మతుల కోసం పంపిస్తే ఒకటి మాత్రమే తీసుకువచ్చి కార్యాలయంలో అప్పగించగా, మరొకటి జాడ లేదని తెలిసింది. ఒక ఏసీ విషయంలో గ్యాస్ లోడింగ్ చేయాల్సి ఉండగా, కావాలనే ఆ ఏసీని కార్పొరేషన్‌కు సంబంధించిన వాహనంలోనే బయటకు తీసుకవెళ్లి మరమ్మతు కోసం షాపులో అప్పగించినట్లు తెలిసింది. అలాగే కార్పొరేషన్ ఆధ్వర్యంలో గతంలో నిర్వహించిన కంటి వెలుగు శిబిరాల సందర్భంగా బల్దియా తరపున 16 స్టాండింగ్ ఫ్యాన్లను కొనుగోలు చేయగా, వాటిలో కొన్ని లెక్క తేలడం లేదని ప్రచారం జరుగుతున్నది. కావాలనే వీటిని పక్కదోవ పట్టిస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా కార్యాలయంలోని ఎలక్ట్రికల్ విభాగంలో విలువైన సామగ్రిని బయటకు పంపించారన్న ఆరోపణలపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఈ విషయమై కార్పొరేషన్ ఎలక్ట్రికల్ విభాగం ఏఈని వివరణ అడిగితే రెండు ఏసీలను మరమ్మతుల కోసం పంపించగా, ఒకటి మాత్రమే తీసుకవచ్చి బిగించారని, మిగతా ఏసీ బిల్లు విషయంలో ఆలస్యమవుతుందని చెప్పడం గమనార్హం.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ధర్మారం, అక్టోబర్ 5: దొంగతురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని లోరేవెల్లి అనూష (9వతరగతి) ఎస్‌జీఎఫ్ అండర్-17బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 6 నుంచి 8వరకు మెదక్ జిల్లా నారాయణపేట్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తరపున పాల్గొననున్నది. విద్యార్థిని హెచ్ఎం వేణుగోపాల్‌రెడ్డి, వ్యాయామ టీచర్ శ్రీనివాస్, టీచర్లు అభినందించారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

గోదావరిఖని, అక్టోబర్ 5: సింగరేణి ఆర్జీ-1 వర్క్ పీపుల్స్ స్పోర్ట్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఇంటర్ డిపార్ట్‌మెంటల్ కబడ్డీ క్రీడా పోటీలను ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ శనివారం ప్రారంభించారు. పోటీలో జీడీకే 1 గ్రూప్ అండ్ 11గ్రూప్ ఉద్యోగులు తలపడ్డారు. ఇక్కడ టీటీసీ అధికారి లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లాగౌడ్, ఏరియా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కార్యదర్శి సారంగపాణి, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ రమేశ్, కోఆర్డినేటర్ సంతోష్‌రెడ్డి ఉన్నారు.

ఖనివాసి ట్రేడింగ్ సెంటర్ ప్రారంభం

గోదావరిఖని, అక్టోబర్ 5: రాష్ట్ర ప్రభుత్వ ప్రొటోకాల్ చైర్మన్ హర్కార వేణుగోపాల్ తన దుబాయి పర్యటనలో శుక్రవారం అక్కడ లిసింగ్ సెంటర్, శేరినప్లాజా, ఇత్రస్ట్రీట్ డైర క్రోణిక్‌లో గోదావరిఖని నివాసి కోటకుమార్ ఏర్పాటు చేసిన అక్షర గోల్డ్ డైమండ్స్ ట్రేడింగ్ సెంటర్, కేకే కాపిటల్ ఇన్వెస్ట్మెంట్స్ కార్యాలయాలను ప్రారంభించారు. సామాన్య కుటుంబానికి చెందిన కోట కుమార్ రియల్ ఎస్టేట్‌తో అంచెలంచెలుగా ఎదిగి నేడు దేశ విదేశాల్లో అక్షర గోల్డ్ డైమండ్స్ వ్యాపారంతో ముందుకు సాగుతూ, కేకే కాపిటల్ ఇన్వెస్టెమెంట్ కంపెనీలను ప్రారంభించడంపై హర్కర వేణుగోపాల్ అభినందించారు.

వాస్తవ లాభాల్లో వాటా కోసం..

బీఆర్ఎస్, టీబీజీకేఎస్ పోరుబాట

- నేడు ఖని చౌరస్తాలో నిరసన దీక్ష
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై మండిపడుతున్న కార్మిక లోకం

గోదావరిఖని, అక్టోబర్ 5 : ఆది నుంచీ సింగరేణి కార్మికుల పక్షాన నిలుస్తున్న బీఆర్ఎస్, టీబీజీకేఎస్.. తాజాగా రేవంత్ సర్కార్ దోఖాపై పోరు సాగిస్తున్నాయి. సంస్థ గత ఆర్థిక సంవత్సరం సాధించిన నికర లాభాల్లో వాటా కోసం గోదావరిఖనిలో ఆదివారం పెద్ద ఎత్తున నిరసన దీక్షకు పిలుపునిచ్చాయి. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి కలిసి రోజంతా నిర్వహించే ఈ దీక్షకు మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. గోదావరిఖని ప్రధానచౌరస్తాలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగే దీక్షలో సింగరేణి కార్మికులు, సకలజనులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నారు.

ప్రచారం 33శాతం.. ఇచ్చింది 16.9శాతం

రాష్ట్రం ఏర్పడిన తొలి ఏడాది 2014-2015లోనే సింగరేణి లాభాల నుంచి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులకు 21శాతం, 2022-23లో ₹2,222 కోట్ల నికర లాభాలు వస్తే కార్మికులకు ఏకంగా 32 శాతం ప్రకటించింది. నష్టాల్లో ఉన్న సింగరేణి సంస్థను లాభాల బాటలో పట్టించి కార్మికుల కష్టానికి గుర్తింపుగా ఆర్జించిన నికర లాభాల నుంచి కార్మికులకు ప్రతి ఏడాది వాటాను అందించింది. కానీ, కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత తాము నష్టపోవాల్సి వస్తున్నదని కార్మికలోకం చెబుతున్నది. నిజానికి 2023-24 సంవత్సరానికి సింగరేణి సంస్థకు ₹4,701కోట్ల నికర లాభం వస్తే.. అందులో కేవలం ₹796 కోట్లు (16.9 శాతం) కార్మికులకు ఇచ్చి 33 శాతం ఇచ్చినట్టు కాంగ్రెస్ సర్కారు చెబుతున్నది. అయితే, నికరలాభాల్లో 33శాతం వాటా అంటే ₹1,550 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, కేవలం ₹796 కోట్లు మాత్రమే ఇవ్వడం ఏంటని? ఇది ఎంతశాతం అవుతుందని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. వాస్తవ లాభాల్లో సింగరేణి విస్తరణ కోసం ₹2వేల కోట్లకు పైగా నిధులను పక్కన పెట్టి మిగతా లాభాలపై 33 శాతం ఇచ్చినట్టు చెప్పకోవడం సరికాదని మండిపడుతున్నారు. ప్రభుత్వం చేసిన మోసానికి ఒక్కొక్కరికి ₹2 లక్షల లాభాలు తగ్గాయని వాపోతున్నారు. గత 15 ఏళ్లలో ఈసారే అత్యంత తక్కువ శాతం అందాయని అంటున్నారు.

మండిపడుతున్న కార్మికులు

సింగరేణి లాభాల్లో 50శాతం కోత విధించి రేవంత్ సర్కార్ మోసం చేసిందని కార్మికులు భగ్గుమంటున్నారు. సంస్థ గత ఆర్థిక సంవత్సరం సాధించిన నికర లాభాల్లో భారీ మొత్తంలో(33 శాతం) పంచుతున్నట్టు ప్రచారం చేసుకుంటున్నదని, కానీ, ఇచ్చేది మాత్రం 16.9శాతమేనని మండిపడుతున్నారు. తమ జీవితాలను చీకటిమయంగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గత పదేళ్లలో కార్మికులకు అందిన లాభాలు

సంవత్సరం	నికర లాభం	కార్మికులకు పంచిన వాటా	శాతం
2023-24 (ప్రభుత్వం చెప్పేది 33 శాతం)	₹4,701 కోట్లు	₹79 కోట్లు	16.90
2022-23	₹2,222కోట్లు	₹700 కోట్లు	32
2021-22	₹1,227కోట్లు	₹368 కోట్లు	30
2020-21	₹272.64కోట్లు	₹79 కోట్లు	29
2019-20	₹993 కోట్లు	₹278 కోట్లు	28
2018-19	₹1,765కోట్లు	₹494 కోట్లు	28
2017-18	₹1,212కోట్లు	₹327 కోట్లు	27
2016-17	₹395 కోట్లు	₹99 కోట్లు	25
2015-16	₹1,066కోట్లు	₹45 కోట్లు	23
2014-15	₹490కోట్లు	₹103 కోట్లు	21

మోసాన్ని ఎండగడుతూనే దీక్ష

సింగరేణి కార్మికులకు లాభాల వాటాలో మోసం చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం గోదావరిఖని చౌరస్తాలో నిరసన దీక్ష చేస్తున్నాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సింగరేణి కార్మికులకు అనేక హక్కులతోపాటు కారుణ్య నియామకాలను అమలు చేసిన ఘనత కేవలం అప్పటి సీఎం కేసీఆర్‌కే దక్కుతుంది. సింగరేణి సంస్థ సాధించిన నికర లాభాలపై ప్రతి ఏటా వాటాను పెంచాం. 2022-23 ఆర్థిక సంవత్సరంలో సంస్థ సాధించిన ₹2,222 కోట్ల లాభాలపై గరిష్ఠంగా 32శాతం లాభాల వాటా చెల్లించాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను అణగదొక్కుతున్న మాదిరిగానే సింగరేణి కార్మికులకు అనేక రకాలుగా ఇబ్బందులు సృష్టిస్తూ వారికి న్యాయంగా దక్కాల్సిన లాభాల వాటాను సగానికి కుదించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుంది. కార్మికులకు ₹1,550 కోట్ల లాభాల వాటా దక్కాల్సి ఉండగా కేవలం ₹796 కోట్లతో సరిపుచ్చే విధంగా చేయడాన్ని వ్యతిరేకిస్తున్నాం. ఈ కారణంగానే నిరసనను తెలియజేడానికి ఆదివారం గోదావరిఖని చౌరస్తాలో ఒకరోజు దీక్షా కార్యక్రమాన్ని చేపడుతున్నం. అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు విజయవంతం చేయాలి.

- కోరుకంటి చందర్, రామగుండం మాజీ ఎమ్మెల్యే

రేవంత్‌రెడ్డికి బుద్ధి చెప్పాలి

సింగరేణి కార్మికులను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బుద్ధి చెప్పేలా కార్మికులు ముందుకు సాగుతున్నారు. గతంలో సింగరేణి కార్మికులకు చెల్లించిన లాభాల వాటాతో సంబంధం లేకుండా ఈసారి సింగరేణి విస్తరణ కోసం రూ.2000 కోట్లకు పైగా పక్కన పెట్టి మిగతా మొత్తాన్ని లాభాలుగా చూపిస్తూ 33 శాతం వాటాను చెల్లిస్తున్నట్లు ప్రకటించడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరంలో రూ.4,701 కోట్ల లాభాలు సాధించినట్లు స్వయంగా రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క పేర్కొంటూనే అందులో నుంచి పెద్ద మొత్తంలో డబ్బులను పక్కన పెట్టి మిగితా కొంత మొత్తానికి మాత్రమే లాభాల వాటా చెల్లిస్తున్నట్లు ప్రకటించారు. వాస్తవంగా చూస్తే లాభాల వాటా ఈసారి కేవలం 16.9 శాతంగానే ఉంది. ప్రకటించడం మాత్రం 33 శాతంగా పేర్కొన్నారు. ఇది ఎంత వరకు కరెక్ట్. సంజాయిస్ ఇవ్వాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అవేమీ చెప్పకుండా సింగరేణి కార్మికులకు పెద్ద మొత్తంలో బోనస్ ఇస్తున్నట్లు పేర్కొనడం హాస్యాస్పదంగా ఉంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు నికర వాస్తవ లాభాలపై వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం.

- మిర్యాల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు

కూర'గాయాలు'

- సెంచరీ కొట్టిన టమాట
- కంటతడి పెట్టిస్తున్న ఉల్లి
- సామాన్యుడికి భారంగా ధరలు

కోల్‌సిటీ, అక్టోబర్5: 'ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు'.. అన్నట్టు ఉంది కూరగాయల ధరలు చూస్తుంటే. రోజువారి వంటలో టమాట పాత్ర కీలకం.. టమాట లేని కూరలుండవు.. అలాంటి టమాట ఇప్పుడు సెంచరీ కొట్టేసింది. కిలో టమాట వందకు ఎగబాకింది. ఇక ఉల్లి కోయకముందే కంట తడిపెట్టిస్తుంది. స్థానికంగా కూరగాయల పంటల ఉత్పత్తి లేక.. ఇతర రాష్ట్రాల నుంచి దిగుబడి కారణంగా అమాంతం ధరలు పెంచాల్సి వస్తుందని వ్యాపారులు చెబుతున్నారు. మొన్నటికి మొన్న కిలో టమాట ₹20 పలికితే ఇప్పుడు ₹100కి చేరింది. మిర్చి కిలో ₹80కి చేరుకొని మరింత ఘాటెక్కిస్తుంది. ఉల్లి రేటు ₹50 నుంచి ₹60పలికి ఇంటింటా లొల్లి పెడుతున్నది. కాకరకాయ కిలో ₹50కి చేరి చేదుగా మారింది. ఆరోగ్యానికి ఆరోగ్యంగా తక్కువ ధరకు లభించే కాలీఫ్లవర్ కిలో ₹100కి చేరుకొని వినియోగదారులను గోబ్యాక్ అంటుంది. బీరకాయ కిలో ₹70తో చేతికందడం లేదు. చిక్కుడుకాయ కిలో ₹100పలుకుతుంది. తోట కూర ఒక కట్ట ₹30 అంటుంది. ఉల్లిని ఉత్పత్తి చేసే అగ్రగామి రాష్ట్రం మహారాష్ట్రలో కరువు లాంటి పరిస్థితుల కారణంగా ఉల్లి లోటు ఉందంటున్నారు. కొందరు వ్యాపారులు ఇదే అదను చేసుకొని ఉల్లిని నిల్వ చేసి ధరలు మరింతగా పెరిగేలా చేస్తున్నారని, తర్వాత అమ్ముకోవాలని చూస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

పాలకుర్తి, అక్టోబర్ 5: ఆయిల్‌పామ్ సాగుపై కుక్కలగూడూర్‌లో శనివారం రైతులకు డీఏవో దోమ ఆదిరెడ్డి, ఉద్యానవనశాఖ అధికారి జగన్మోహన్‌రెడ్డి అవగాహన కల్పించారు. మొక్కలపై 90శాతం, డ్రిప్ పరికరాలపై 80శాతం రాయితీ ఇవ్వడంతోపాటు, అంతర పంట